# ప్రవహించే నది

''ఆత్మ వంచన చేసుకుంటావా?'' ఈ ప్రశ్న ఒక రోజు నాకే ఎదురౌతుందని నేననుకోలేదెప్పుడూ.

రోజూ లాగే సాయంత్రం కాంటీన్‌లో కాఫీ తాగుతుంటే జేమ్స్ సీరియస్‌గా అన్నాడు.

''మనం పెళ్ళి చేసుకుందాం!''

నేను భయపడుతున్న క్షణాలు ఇవే.

'అతడికి 'నో' అని చెప్పలేను. అతడు నన్ను అడగకూడదు. ఈ స్నేహం ఇట్లాగే సాగిపోవాలి' అని కోరుకున్నాను.

కానీ అతడు ఊరుకోలేదు. అడిగాడు.

అతడి మేధాశక్తి, జీవితం పట్ల అతడికి వున్న అవగాహన నాకు అతడిని స్నేహితుడిగా, సన్నిహితుణ్ణిగా చేశాయి.

అతడి బాహువులలో ఇమిడిపోవాలని, అతడితో కలిసి జీవితం పంచుకోవాలని నాకు కోరికలు లేవనటం అబద్ధం అవుతుంది. అయినా ''అసంభవం!'' అన్నాను. అంతకంటె చేసేదేమీ లేదు.

''ఎందుకని? డోంట్ యూ లవ్ మీ?'' అనడిగాడు కళ్ళలోకే చూస్తూ.

నేనూ కొంచెంసేపు చూస్తూ వుండిపోయాను. తర్వాత ''నేను అబద్ధం చెప్పలేను. ఐ లవ్ యు! కానీ.. .నేను పెళ్ళి చేసుకోలేను. మా నాన్నగారిని ఒప్పించలేను. బాధ పెట్టలేను.'' అన్నాను.

''అందుకని నీ ఆనందాన్ని త్యాగం చేస్తావా? ఆత్మవంచన చేసుకుంటావా?'' అని ప్రశ్నించాడు.

ఏది ఆత్మవంచన?

నా తండ్రి ఉత్తముడు. నేను ఆయన్ని ఆరాధిస్తున్నాను. నాకూ ఆ విలువల మీద నమ్మకం వుంది. ఆ విలువల్ని నిలుపుకోవటం ఆత్మవంచన ఎందుకవుతుంది? స్వార్థంకోసం విలువల్ని వదులుకోవటం ఆత్మ వంచన కాదా? మనిషికి ఆనందమే పరమావధా? విలువలు బూటకమా? ఆత్మవంచనో, అభిమానం... అవన్నీ తర్కించటం అనవసరం. నేను చేయవల్సింది చెయ్యటమే.

పిల్లల్ని మంచి క్రమశిక్షణలోనే పెంచారు నాన్నగారు. అయినా ఘర్షణ తప్పటంలేదు.

అప్పుడు శంకరన్నయ్య–నాన్నగారు.

ఇప్పుడు నేను–నాన్నగారు.

ఖద్దరు పంచ, లాల్చీ ధరించిన స్ఫురద్రూపం!

మంచికోసం మనుషుల లోపలికి చూసే కళ్ళకాంతులు. సత్యం కోసం నిప్పుల మీద నడిచే పటిష్ఠమైన పాదాలు. మానవత్వం పండించటానికి కరుణ కురిపించే మాటలు. మృదూని కుసుమాదపి వజ్రాదపి కఠోరాణి!

ఇంత మంచితనం నిజంగా వుంటుందా మనుషుల్లో? ఇటువంటి మనుషులున్నారా ఈ రోజుల్లో? నువ్వు పోషిస్తే వుంటుంది మంచితనం. మంచితనం వుండాలంటే ఆదర్శాలుండాలి.

ఈనాడు ఆదర్శాలు లేక, ఆచరించలేక అదంతా హిపోక్రసీ అంటున్నారు. ఆదర్శాలు బూటకం. ఆత్మవంచన అంటున్నారు బలహీనులు! ఆయన ఆస్తిపరులు కాకపోయినా ఎందరికో సాయం చేశారు. నాన్నగారి సంపాదన ఆరు రెట్లు పెరిగినా ఆయన జీవన విధానంలో మార్పులేదు. అన్నంలో మజ్జిగ వేసుకునేవారు.

అందరిళ్ళల్లో ఫోమ్‌బెడ్‌లు వచ్చినా మామూలు పరుపుమీదే పడుకునేవారు. భోగలాలస లేదు!

లేదు అనే బాధలేని కర్మయోగి.

శంకరన్నయ్యకి అమెరికాలో చదువుకి స్కాలర్‌షిప్ వచ్చింది.

''నేను అమెరికా వెడతాను'' అన్నాడు అన్నయ్య.

ఒకరోజంతా నాన్నగారు మాట్లాడలేదు. ఆరోజు రాత్రి మేమంతా పడుకున్నాక కూడా బయట వరండాలో కుర్చీలో కూర్చునేవున్నారు. మర్నాడు పొద్దున్న అన్నయ్యని పిలిచారు.

''శంకర్! నువ్వు అమెరికా వెళ్ళటం నాకు ఇష్టంలేదు'' అన్నారు.

నాలుగు రోజులు గడిచాయి. భోజనాలు చేస్తున్నాము.

''నేను స్టేట్స్‌కి వెళ్ళటానికి నిశ్చయించుకున్నాను వీసా కోసం రేపు మెడ్రాస్ వెళుతున్నాను'' అన్నాడు అన్నయ్య.

వెంటనే నాన్నగారు తలెత్తలేదు. ఏమీ అనలేదు. మజ్జిగ అన్నం తింటూ వుండిపోయారు. మేము నాన్నగారినే చూస్తున్నాం. ఏమంటారో అని!

ఎంత అవమానం భరిస్తున్నారు!

ఆయన తల పైకెత్తి శంకరన్నయ్యని చూసిన చూపు!

నాకు అర్థంకాలేదు. అవమానాన్ని దిగమింగేశారా?

బాధని..మౌనంగా భరిస్తున్నారా?

అగ్నిపర్వతాన్ని అణుస్తున్నారా?

ఛీ..ఛీ ఏం పిల్లలు! కని పెంచి, మమత ఇచ్చి. త్యాగాలు చేసిన తల్లిదండ్రుల్ని కాదని ఎట్లా ఎడమైపోతారో కృతఘ్నులు. పిల్లల్ని శాసించే హక్కు తల్లిదండ్రులకి లేదా? కేవలం బాధ్యతేనా? తల తిరిగి యధాస్థానానికి వచ్చేటట్లు అన్నయ్యని చెంప దెబ్బ కొట్టాలని పించింది. నేనే అబ్బాయినయివుంటే ఫుట్‌బాల్‌ని తన్నినట్లు తన్ని వుండే దాన్ని. అమెరికా! ఏం వుంది అమెరికాలో? మేడలు, కార్లు... వస్తువులు... సుఖాలకోసం యాంత్రిక జీవనం!

కన్నవాళ్ళని, మాతృదేశాన్ని విడిచి దూరంగా వెళ్ళిపోతున్నారు. ఛీ.. మనుషులు పాడై పోతున్నారు. దేశం నాశనమైపోతోంది. నాన్నగారికి తల్లినై ఓదార్చాలనిపించింది. గదిలో పడుకున్నారు. అమృతాంజనం తీసికెళ్ళాను.

తల నొప్పిగా వుందా? అమృతాంజనం రాస్తాను'' అన్నాను.

వద్దు అనలేదు. పొమ్మనలేదు.

''రాయి'' అన్నారు నవ్వి.

శంకరన్నయ్య వెళ్ళిపోయాడు. నాన్నగారు మాట్లాడకుండానే వాడికి కావలసిన వన్నీ ఇచ్చారు... డబ్బు, సంతకాలు పెట్టడంలాంటి ఫార్మాలిటీస్ అన్నీ జరిపారు. ఆరోజు రాత్రి వరండాలో కూర్చున్నాము. అమ్మ దిగులుగా వుంది. ఎవరితోనూ మాట్లాడటంలేదు. నాకు బాధే కాదు కోపంగా కూడా వుంది.

''నాన్నగారూ, మీరు శంకరన్నయ్యని ఎందుకు వెళ్ళనిచ్చారు?'' అన్నాను నిష్ఠూరంగానే

''వాడు వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు!'' అన్నారు నాన్నగారు.

''మీరు 'వొద్దు' అంటేవెళ్లేవాడు కాదు. మీరు శాసించలేదు. ఊరికే 'నాకు ఇష్టంలేదు' అన్నారు. అంటే మీకు ఇష్టంలేదు కానీ వాడికి ఇష్టమైతే వెళ్లవచ్చు అని అర్థంకదా!'' అన్నాను.

నాన్నగారు శాంతంగా నవ్వారు. ''నువ్వు చాలా తెలివైనదానివి!'' అన్నారు.

''ఏ కాలంలోనైనా ఏదో ఒక ఘర్షణ మనిషి జీవితంలో వుంటుంది. ప్రస్తుతం మన సంస్కృతిని మనం మరిచిపోయి, ఒక పరాయి సంస్కృతి...భౌతిక సంపదలకి విలువనిచ్చే సంస్కృతిని మనం ఆహ్వానిస్తున్నాం.

భౌతిక సంపదలు అవసరమే. కాదనను. కానీ అవి ఆధ్యాత్మికతకి, మానవ కల్యాణానికి ఉపయోగపడాలి.

శరీరం లేని ఆత్మ లేదు.

ఆత్మ లేక శరీరానికి విలువ లేదు.

ఏది ముఖ్యం అంటే రెండిటి సమన్వయం ఉత్తమం.

కానీ ప్రకృతి శక్తులు మనని ఒక పరిధిలో వుండనివ్వవు. ఆ సమన్వయాన్ని నిలుపుకోనివ్వవు. నిలుపుకోవాలంటే నిత్యం పోరాటం సాగించాలి.

మన దేశానికి చెయ్యాల్సింది ఎంతో వుంది. ఉండగా మేధావులు, సమర్థతగలిగివున్న యువకులు ఇతర దేశాలకి వెళ్ళి తమ శక్తులన్నీ ధారపోసి సుఖాలు కొనుక్కుంటున్నారు.

వాడు ఇక్కడే వుండి తన శక్తిని దేశాభివృద్ధికి అర్పించాలనీ, మన సంస్కృతిని రక్షించాలనీ కోరుకున్నాను. కానీ వాడు విదేశాలకి వెళ్ళి పేరు ధనం ఆర్జించాలని ఆశిస్తున్నాడు.

వాడిని ఆపటానికి నాకేం హక్కు వుంది.

పిల్లల్ని పెంచి, చదువు చెప్పించటం మా బాధ్యత. వాడి జీవితాన్ని శాసించే హక్కు నాకు లేదు'' అన్నారు కానీ నాన్నగారు చాలా బాధపడ్డారు.

కొడుకుని వదలి వుండలేక కాదు,. మంచి ఆదర్శాలకి దూరంగా వెళ్ళినందుకు. త్యాగమార్గం వదిలి భోగమార్గం వరించినందుకు.

అప్పుడు నిశ్చయించుకున్నాను నాన్నగారిని కష్టపెట్టకూడదని. నాన్నగారికి దేశాభిమానం ఎక్కువ. మతాభిమానం కూడా ఎక్కువే. దానికి వ్యతిరేకంగా నేనెప్పుడూ ప్రవర్తించను.

అక్కయ్యలిద్దరికీ పెళ్ళి అయింది. ఇప్పుడు నా పెళ్ళి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జేమ్స్ వంటి ఉత్తమ వ్యక్తి నాకు పరిచయం అవటం నా దురదృష్టం

అనుకోవాలా? నాకు ఒక పరీక్ష అనుకోనా?

నిజమే. పిల్లల జీవితాల్ని శాసించే హక్కు తల్లిదండ్రులకి లేదని నాన్నగారే అన్నారు. అయినా నా నిర్ణయం చేసుకునే హక్కు నాకుంది. నేను జేమ్స్‌ని చేసుకోను.

ఒక వ్యక్తి జీవితంలో పెళ్ళి ఒక భాగం. సంఘం, సంస్కారం, దేశం సంస్కృతి కూడా జీవితంలో భాగాలే.

ఈనాటి మనుష్యుల్లో నాకు, నాన్నగారికి నచ్చిన వ్యక్తి దొరక్కపోవచ్చు. పెళ్ళి చేసుకోవటం మానేస్తాను. నేను బలహీనురాల్ని కాదు. నిశ్చయానికివచ్చాకపెళ్ళి పడుకున్నాను.

* * * *

నాలుగు రోజులు గడిచాయి. నా నిశ్చయంలో మార్పులేదు. తెల్లవారింది. ఇంకొక రోజు పుట్టింది ఎదుర్కోవడానికి.

అద్దంలో చూసుకుంటే కళ్ళు ఎర్రగా వున్నాయి. కొంచెం తల నొప్పిగా కూడా వుంది. కిటికీ దగ్గర నిలబడ్డాను.

సూర్యోదయాన్ని చిత్రించాలనుకుంటే...సిరా ఒలికిన కాగితంలా వుందీ ప్రపంచం! ఆఫీస్‌కి వెళ్ళటానికి తయారవుతున్నాను.

''గుంటూరు వాళ్ళ సంబంధం గురించి ఏమాలోచించారు'' అంటోంది అమ్మ.

నాన్నగారు నా గదిలోకి వచ్చారు. నా మొహంలోకి చూస్తూ – ''తలనొప్పిగా ఉందా?'' అనడిగారు చిరునవ్వుతో.

''ఊఁ! రాత్రి నిద్రపట్టలేదు సమంగా'' అన్నా కొంచెం కంగారుపడుతూ.

''నాకు తెలుసు నీకు తలనొప్పి ఎందుకో. అనవసరంగా ఆలోచించకు. నువ్వు జేమ్స్‌ని పెళ్ళిచేసుకో'' అన్నారు. మళ్ళీ–

''నాకు ఇష్టం లేదనుకుంటూన్నావు. నాకు ఇష్టమే'' అన్నారు. నేను నిలబడలేక మంచంమీద కూర్చున్నాను. నాన్నగారు కూడా నా పక్కన కూర్చున్నారు.

''నీకు ఆశ్చర్యంగా వుంది. నాకెలా తెలుసునుకుంటున్నావు కదూ! గోపాల్ అంకుల్ చెప్పారు. జేమ్స్ ఆయన ద్వారా నాకు కబురు చేశాడు. తనే వచ్చి మాట్లాడాడు. మంచి సంస్కారం వున్న వ్యక్తి'' అన్నారు.

''నిజంగా మీకు అభ్యంతరం లేదా? బాధపడరూ'' నాలో అనుమానం–

''మనిషికి ఆదర్శాలు వుండాలి. ఆ కాలానికి తగిన ఆదర్శం కోసం ప్రాణత్యాగం చెయ్యటం ఎంత ఔన్నత్యమో కాలానికి అవసరంలేని ఆదర్శాన్ని వదులుకోవటం

కూడా అంతకంటే అవసరం. శంకర్ అమెరికా వెళ్ళినప్పుడు నేను బాధపడ్డాను. నిజమే. అందుకని నువ్వు అప్పుడు ఆ నిర్ణయం చేసుకున్నావు. నాన్న గారికి ఇష్టంలేని పని చెయ్యకూడదని. కానీ ఇప్పుడు పరిస్థితులు ఏమిటి? దేశం కోసం పాటుపడే తరం అంతరించింది. ఈనాటి అవినీతి పాలనలో అనామకుడిగా అంతరించటంకంటే విదేశాలలో స్వశక్తితో కీర్తి, ధనం ఆర్జించటమే మేలు.

మంచి మనిషి ఎక్కడ వున్నా మానవ కల్యాణానికి తోడ్పడతాడు. రచ్చ గెలిచి ఇంట గెలవటం అన్నమాట'' అన్నారు.

''అందరూ విదేశాలకి వెళ్ళిపోతుంటే, అన్యమతస్థుల్ని పెళ్ళి చేసుకుని మన భాషని, ఆచారాలని మరిచిపోతుంటే మన సంస్కృతి ఏమౌతుంది నాన్నగారూ?'' నేను తీవ్రంగానే ప్రశ్నించాను.

నాన్నగారి మొహంలో మార్పులేదు. అల్లాగే ప్రసన్నంగా వుంది.

''ఇప్పుడు మనం మన ఆచారాల్ని ఎంతవరకూ పాటిస్తున్నాం? కాలంతో బాటు మనిషి ఆచారవ్యవహారాలు మారిపోతాయి. సంస్కృతి ఆచారాల పరిధికి కట్టుబడి వుండదు. సంస్కృతి ఆలోచనలో, ఆదర్శాలలో వుంటుంది. వాటిని బట్టి ఆచరణ మారుతుంది. సంస్కృతి నిలవ నీరు కాదు. ప్రవహించే నది. పనికిరాని పాతని వదిలి అభ్యుదయ కరమైన నవ్యతని తనలో కలుపుకుంటుంది.

మన మతం ఇతర మతాలలాగ రిజిడ్ కాదు. వ్యక్తి తన మార్గం, ముక్తి తనే వెతుక్కోవాలంటుంది. భక్తి, కర్మ, జ్ఞానమార్గాలలో...ధార్మికత, ఆధ్యాత్మికత ఎక్కడ వుంటే అక్కడ హిందూదేశం వుంది. కరుణ, సద్భావన, సదాచరణ వున్న చోట హిందూమతం వుంది. మట్టికి, మనిషికి ఎల్లలు లేవు. అర్థం చేసుకో..'' అని నాన్నగారు వెళ్ళిపోయారు.

''నాన్నగారు కాల ప్రవాహపు ఉధృతానికి తలఒంచి, తనని సమర్థించు కుంటున్నారా? సంస్కృతి ప్రవహించే నది!

అన్ని నదులూ ప్రవహించి, ప్రవహించి సముద్రంలో కలిసి.. అన్ని మతాలూ ఏకమై అపారమైన మానవతావాదమై...ఈ ధరిత్రినిండా శుభం పూచి..''

వెనక్కి వెడుతున్న కెరటం ముందుకొస్తున్న కెరటానికి సందేశాన్నిచ్చి విరిగిపోయింది. కాలం మారటాన్ని చూస్తున్న అద్భుతమైన అనుభూతి నాలో మిగిలిపోయింది.

* * * *